


sahanamvande.com

సహనం వందే

epaper.sahanamvande.com

హైదరాబాద్ | 13-11-2026 శుక్రవారం | సంపుటి-02 సంచిక : 193 EDITOR: ROHINI



టెక్ ప్రపంచంలో సెక్స్ స్కాండల్స్



రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన అనేకమంది సీఈఓలు!

- ఎన్విడియా బాసుపై వేటుతో కార్పొరేట్ ఉలికిపాటు
- రాసలీలలు, విచ్చలవిడితనంపై కంపెనీల ఉక్కుపాదం!
- నైతికత తప్పినందుకు సంచలన వేటుతో గెంటివేత
- ఎన్విడియా నుంచి ఇంటెల్ దాకా ఉద్వాసనల పర్వం
- కార్పొరేట్ రంగంలో నైతిక విలువలే అసలైన కొలమానం!

కార్పొరేట్ రంగం అంటే

అపరిమితమైన స్వేచ్ఛ, భారీ వేతనాలు, విలాసవంతమైన జీవనశైలి అని చాలా మంది భావిస్తుంటారు. అక్కడ ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు ఉండొచ్చని, వ్యక్తిగత జీవితంలో ఏది చేసినా చెల్లుతుందని అనుకుంటారు. కానీ, ఆ రంగుల ప్రపంచం వెనుక అత్యంత కఠినమైన నియమ నిబంధనలు, ఉక్కు లాంటి క్రమశిక్షణ ఉంటాయి. స్వేచ్ఛను విచ్చలవిడితనంగా మార్చుకుని, కంపెనీ రూల్స్ బ్రేక్ చేసిన ఎంతటి దిగ్గజాలకైనా ఆ కుర్చీలో ఒక్క నిమిషం కూడా కూర్చునే అర్హత ఉండదు. ఎంతటి ఉన్నత పదవిలో ఉన్నవారైనా వ్యక్తిగత ప్రవర్తన సరిగ్గా లేకపోతే కార్పొరేట్ బోర్డులు ఎంతమాత్రం సహించవని చరిత్ర అనేకసార్లు నిరూపించింది.

- సహనం వందే, హైదరాబాద్

ప్రపంచ టెక్ దిగ్గజం ఎన్విడియా సీఈఓగా అసాధారణ విజయాలు సాధించిన జెన్సెన్ హువాంగ్... వ్యక్తిగత ప్రవర్తన, వివాహేతర సంబంధాల కారణంగా ఒక్కసారిగా కుర్చీ కోల్పోవాల్సి వచ్చింది. కేవలం వ్యక్తిగత అఫైర్ మాత్రమే కాకుండా, అందులో ఒక మహిళ చైనా గూఢచారిగాఅ అనుమానించటం దేశ భద్రతను తాకే తీవ్రమైన అంశంగా మారింది. కంపెనీ రహస్యాలు, టెక్నాలజీ డేటా పరాయి దేశాల చేతికి చిరిగే ప్రమాదం ఉందనే భావనతో బోర్డు ఎలాంటి ముందస్తు మినహాయింపులు ఇవ్వకుండా తక్షణ చర్య తీసుకుంది. ఇక ఆహార ఉత్పత్తుల రంగాన్ని శాసించే ప్రపంచ దిగ్గజం నెస్లే మాజీ సీఈఓ మార్క్ ష్నైడర్ హయాంలో నైతిక ప్రమాణాలు సడలిపోతున్నాయనే సంకేతాలు రావడంతో ఆయన పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.

ఇంటెల్, మెక్‌డొనాల్డ్స్ సీఈఓల తప్పులు

టెక్నాలజీ రంగానికి మరో ఉదాహరణ ఇంటెల్ మాజీ సీఈఓ బ్రయాన్ కర్జానిచ్, తన కింద పనిచేస్తున్న ఉద్యోగితో రహస్యంగా సంబంధం కొనసాగించినట్లు నిరూపితమైంది. కార్పొరేట్ గవర్నెన్స్ నిబంధనల ప్రకారం ఉన్నత అధికారులకు కింది స్థాయి ఉద్యోగులతో ఇలాంటి సంబంధాలు ఉండకూడదు. ఇది అధికార దుర్వినియోగానికి, పక్షపాతానికి దారితీస్తుందనే కఠినమైన నిబంధన ఉండటంతో, రూల్ బ్రేక్ చేసినందుకు బోర్డు ఆయనను తక్షణమే సాగనంపింది. ఫాస్ట్ ఫుడ్ రంగంలో ప్రపంచవ్యాప్తంగా పేరున్న మెక్‌డొనాల్డ్స్ మాజీ సీఈఓ స్టీవ్ ఈస్టర్ బ్రూక్ కూడా తన కంపెనీ ఉద్యోగితో సంబంధం పెట్టుకున్నారనే ఆరోపణలు రుజువు కావడంతో మెక్‌డొనాల్డ్స్ బోర్డు తీవ్రంగా స్పందించింది. కంపెనీ ప్రతిష్టను, నైతిక విలువలను దిగజార్చే ఏ చర్యను క్షమించేది లేదని తేల్చిచెప్పింది.

కఠిన నిర్ణయాల వెనుక బలమైన కారణాలు

కార్పొరేట్ కంపెనీలు ఇలాంటి విషయాల్లో కఠినంగా ఉండటానికి బలమైన కారణాలు ఉన్నాయి. ఒక పెద్ద కంపెనీ కేవలం ఉత్పత్తులను అమ్మే వ్యాపారం మాత్రమే కాదు, కోట్లాది మంది ఇన్వెస్టర్ల నమ్మకం, లక్షలాది మంది ఉద్యోగుల భవిష్యత్తు దానిపై ఆధారపడి ఉంటుంది. మార్కెట్లో షేర్లు నిలబడాలన్నా, ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టాలన్నా సంస్థపై నమ్మకం చాలా ముఖ్యం. సీఈఓ చేసే చిన్న నైతిక తప్పిదం కూడా బ్రాండ్ వాల్యూను క్షణాల్లో నున్నా చేసేస్తుంది. స్వేచ్ఛ పేరుతో విచ్చలవిడితనం ఉంటుందనేది అపో మాత్రమేనని, లోపలికి వెళితే ప్రతి క్షణం నిఘా, కఠినమైన ఆడిటింగ్, ప్రవర్తనా నియమావళి ఉంటాయని తెలుస్తుంది. ఒక వ్యక్తి అనైతిక ప్రవర్తన వల్ల వచ్చే జరిమానాలు, న్యాయపరమైన చిక్కులు కంపెనీ మనుగడనే దెబ్బతీస్తాయి.

కాబట్టి బోర్డులు మొహమాటం లేకుండా నిర్ణయాలు తీసుకుంటాయి.

నైతికతే కంపెనీకి అసలైన లైఫ్‌లైన్

నైతికత అనేది కేవలం నిబంధన కాదు, అది కంపెనీకి లైఫ్‌లైన్ లాంటిది. ఎన్విడియా అయినా, నెస్లే అయినా, ఇంటెల్ అయినా ఇవాళ ప్రపంచాన్ని శాసిస్తున్నాయంటే కారణం వారికున్న కఠినమైన క్రమశిక్షణే. ఎప్పుడైతే ఆ క్రమశిక్షణ తప్పుతుందో, లంచాలు, గూఢచర్యం తెరపైకి వస్తాయో అప్పుడు సామ్రాజ్యాలు కుప్పకూలడం ఖాయం. భవిష్యత్ తరాలకు, యువ వ్యాపారవేత్తలకు ఈ ఘటనలన్నీ పాఠం. ఎంత ఎత్తుకు ఎదిగినా నైతిక విలువలకు తిలోదకాలు ఇస్తే నేలకూలక తప్పదనే స్పష్టమైన పాఠం నేర్పుతున్నాయి. చట్టం ముందు, కార్పొరేట్ నియమాల ముందు ఎవరూ అతీతులు కాదనే సత్యాన్ని ఈ ఉదంతాలు బలంగా చాటుతున్నాయి. అంతిమంగా కార్పొరేట్ రంగం నిజాయితీకి, పారదర్శకతకు మాత్రమే పెద్దపీట వేస్తుంది కాబట్టి, నైతికత అనేది కార్పొరేట్ ప్రపంచంలో అత్యంత ఖరీదైన కరెన్సీ.


ప్రియురాలితో ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్

ధాన్యం మాయమైతే మిల్లర్లకు మోతే!

తెలంగాణ రైస్ మిల్లర్లపై కొత్త నిబంధనల కొరడా

- ప్రభుత్వ ధాన్యంలో తేడా వస్తే 25 శాతం జరిమానా
- పాత బకాయిలుంటే కేటాయింపుల నిలిపివేత
- అక్రమాలకు క్రిమినల్ కేసులు... మూడేళ్ల వరకు బ్లాక్‌లిస్ట్
- సీఎంఆర్ ఒప్పందాల్లో మార్పులు... ధాన్యానికి కాపలా
- పౌరసరఫరాల శాఖ 2026-27 సీఎంఆర్ నిబంధనలు

ప్రభుత్వ ధాన్యం మిల్లులకు చేరిన తర్వాత దాని భద్రత, నిల్వలు, వినియోగంపై పూర్తి బాధ్యత మిల్లర్లదే. ధాన్యం నిల్వల్లో తేడా వచ్చినా, బియ్యం సరఫరాలో లోపాలున్నా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. తెలంగాణ పౌరసరఫరాల శాఖ 2026--27 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి కొత్త కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) నిబంధనలను అమల్లోకి తెస్తోంది. ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి బియ్యం ప్రభుత్వానికి చేరేవరకు ప్రతి దశలో మిల్లర్ల బాధ్యతను నిర్దేశిస్తూ ఒప్పందంలో మార్పులు చేసింది. మిల్లులకు అప్పగించిన ధాన్యం, గన్నీ బ్యాగులు, ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ (ఎఫ్ఆర్‌కే) అన్నింటినీ ప్రభుత్వ ఆస్తులుగానే పరిగణిస్తారు. సీఎంఆర్ సరఫరా పూర్తయ్యే వరకు వాటి భద్రత, నిల్వలు, వినియోగంపై అధికారులు పర్యవేక్షణ కొనసాగిస్తారు. - సహనం వందే, హైదరాబాద్

ధాన్యం కేటాయింపుల కోసం మిల్లర్లు ఆర్థిక భద్రత కల్పించాల్సి ఉంటుంది. ఎలాంటి బకాయిలు లేని మిల్లర్లు ధాన్యం విలువలో 10 శాతం బ్యాంకు గ్యారంటీ లేదా 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్ సమర్పించాలి. గతంలో డిఫాల్టర్లుగా మారి, ఆ తర్వాత బకాయిలు చెల్లించిన మిల్లర్లు మాత్రం 20 శాతం బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలి. దీనికి తోడు ఆర్థికంగా బలమైన మరో ఇద్దరు మిల్లర్లు ష్యూరిటీ ఇవ్వడం తప్పనిసరి. పాత బకాయిలు ఇంకా చెల్లించని మిల్లర్లకు కొత్తగా ధాన్యం కేటాయించరు. ఈ నిబంధనలతో గత బకాయిలు ఉన్నవారికి కేటాయింపులు నిలిచిపోనుండగా, మిగతా మిల్లర్లు కూడా ధాన్యం పొందడానికి ముందుగానే భద్రతా ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది.

కొనుగోలు కేంద్రం నుంచే బాధ్యత!

మిల్లర్ల బాధ్యత ధాన్యం మిల్లుకు చేరిన తర్వాతే మొదలుకాదు. కొనుగోలు కేంద్రంలో తూకం వేసే సమయంలోనే వారు తమ ప్రతినిధులను ఉంచి, ధాన్యం నాణ్యతను పరిశీలించి స్వీకరించాలి. ప్రతినిధి లేకపోయినా ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదైన ధాన్యాన్ని మిల్లరు అంగీకరించినట్లుగానే పరిగణిస్తారు. ఆతర్వాత తూకం లేదా నాణ్యతపై అభ్యంతరాలు చెప్పేందుకు అవకాశంఉండదు. ధాన్యం అందుకున్న మూడు రోజుల్లో పూర్తి వివరాలను అధికారులకు సమర్పించాలి. ప్రభుత్వం కేటాయించిన ఏడు రకాల సన్న ధాన్యాన్ని విడిగా నిల్వచేసి, వాటితోనే సన్న బియ్యం తయారు చేయాలి. బాయిల్డ్ సీఎంఆర్‌లో 5 శాతం, రా సీఎంఆర్‌లో 10శాతం బ్రోకెన్‌తో కూడిన ఇంప్రూవ్డ్ రైస్ సరఫరా చేయాలి. ఫోర్టిఫైడ్ బియ్యం తయారీలో ప్రతి 100 కిలోల సాధారణ బియ్యానికి ఒకకిలో ఎఫ్ఆర్‌కే కలపాలి. ఇందుకోసం ప్రత్యేక యంత్రాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు ప్రయోగశాలల్లో నాణ్యత పరీక్షలు చేయించుకోవాలి.



ధాన్యం మాయమైతే 25 శాతం జరిమానా!

ప్రభుత్వ ధాన్యం నిల్వల్లో తేడా కనిపించినా, అప్పగించిన పరిమాణం కంటే తక్కువగా ఉన్నా మిల్లర్ల నుంచి మాయమైన ధాన్యం విలువను పూర్తిగా వసూలు చేస్తారు. దీనికి రికవరీ ఖర్చులు కూడా జతచేస్తారు. అదనంగా 25 శాతం జరిమానా విధించడంతో పాటు వసూలు చేయాల్సిన మొత్తంపై ఏటా 12 శాతం వడ్డీ తీసుకుంటారు. ఈ విషయంలో మినహాయింపులు ఉండవని ఒప్పందం స్పష్టం చేస్తోంది. అవసరమైతే రెవెన్యూ రికవరీ చట్టం కింద బకాయిలు వసూలు చేస్తారు. ప్రభుత్వ ధాన్యాన్ని ప్రైవేట్ ధాన్యంతో లేదా వేర్వేరు సీజన్ల ధాన్యంతో కలపడం నిషేధం. ప్రభుత్వ ధాన్యాన్ని ఇతర అవసరాలకు తరలించడం, విక్రయించడం, తాకట్టు పెట్టడం వంటి చర్యలకు పాల్పడితే ఎసెన్షియల్ కమోడిటీస్ చట్టం-1955తో పాటు ఇతర క్రిమినల్ చట్టాల కింద కేసులు నమోదు చేస్తారు. అవసరమైతే మిల్లుల్లోని నిల్వలను స్వాధీనం చేసుకుని మిల్లింగ్ కార్యకలాపాలను నిలిపివేస్తారు.

తనిఖీల నుంచి బ్లాక్‌లిస్ట్ వరకు!

పౌరసరఫరాల శాఖ, జిల్లా యంత్రాంగం, ఎఫ్‌సీఐ అధికారులు ఎప్పుడైనా మిల్లుల్లో తనిఖీలు నిర్వహించవచ్చు. ప్రతి సోమవారం ధాన్యం స్వీకరణ, మిల్లింగ్, బియ్యం సరఫరా వివరాలను సేకరిస్తారు. నిబంధనలను పదేపదే ఉల్లంఘించే మిల్లర్ల నుంచి ధాన్యాన్ని ఇతర మిల్లులకు తరలించే అధికారం కలెక్టర్లకు ఉంటుంది. ఒప్పందాన్ని రద్దు చేయడంతో పాటు గరిష్ఠంగా మూడేళ్ల వరకు బ్లాక్‌లిస్ట్ చేయవచ్చు. ధాన్యం, బియ్యం, గన్నీ బ్యాగులు, ఎఫ్‌ఆర్‌కేలకు బీమా చేయించడం కూడా ప్రతి మిల్లర్‌కు తప్పనిసరి. అన్ని లెక్కలు పరిశీలించి ప్రభుత్వానికి నష్టం జరగలేదని నిర్ధారించిన తర్వాతే మిల్లింగ్ చార్జీల బిల్లులు విడుదల చేస్తారు. సీఎంఆర్ బకాయిలు పేరుకుపోకుండా, ప్రభుత్వ ధాన్యం పక్కదారి పట్టకుండా చూడటమే ఈ నిబంధనల లక్ష్యం. ఈ ఒప్పందం 2027 సెప్టెంబర్ 30 వరకు అమల్లో ఉంటుంది.

విదేశీ విడాకులు చెల్లవు

సుప్రీంకోర్టు సంచలన తీర్పు

- హిందూ వివాహ చట్టానికి మాత్రమే వర్తింపు
- ఏకపక్ష డిక్రీలకు ఏమాత్రం చట్టబద్ధత లేదు
- ఎన్ఆర్ఐ జంటల రెండో పెళ్లిళ్లకు చిక్కులు
- భారతీయ కోర్టుల ద్వారానే విడాకులు తప్పనిసరి

ఉద్యోగాల కోసం, వ్యాపారాల కోసం విదేశాలకు వెళ్తున్న మనవాళ్లు అక్కడి కోర్టుల్లోనే విడాకులు తీసుకుని కొత్త జీవితాలు మొదలుపెట్టేస్తున్నారు. అసలు అలా విదేశాల్లో విడాకులు తీసుకుంటే మన దేశంలో చెల్లుతాయా లేదా అనే దానిపై సుప్రీంకోర్టు ఒక సంచలన తీర్పునిచ్చింది. మన దేశంలో పెళ్లి చేసుకుని విదేశాల్లో విడాకులు తీసుకునే వారికి ఇది ఒక పెద్ద షాక్ అనే చెప్పాలి. - సహనం వందే, న్యూఢిల్లీ

భారతదేశంలో పెళ్లి చేసుకున్న జంటలకు విదేశీ కోర్టులు ఇచ్చే విడాకుల తీర్పులు ఆటోమేటిక్‌గా చెల్లవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. భార్యాభర్తలు విదేశాల్లో స్థిరపడినప్పటికీ, హిందూ వివాహ చట్టం ప్రకారం వారి పెళ్లికి ఇక్కడి నిబంధనలే వర్తిస్తాయి. ఏ దేశంలో వివాహం జరిగిందో ఆ దేశపు అధికార పరిధి ఉన్న కుటుంబ కోర్టులోనే విడాకుల ప్రక్రియ జరగాలని కోర్టు తేల్చిచెప్పింది.

ఏకపక్ష డిక్రీలకు చట్టబద్ధత శూన్యం

విదేశాల్లో ఉంటున్న భాగస్వాములో ఒకరు మాత్రమే కేసు వేసి, మరొకరికి సరైన సమాచారం ఇవ్వకుండానే ఏకపక్షంగా విడాకుల ఆర్డర్ తెచ్చుకుంటున్న ఘటనలు పెరుగుతున్నాయి. మన దేశ చట్టాలకు, ప్రజా విధానానికి వ్యతిరేకంగా ఉండే ఇలాంటి ఏకపక్ష విడాకుల డిక్రీలను సివిల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం ఇక్కడ అమలు చేయడం సాధ్యం కాదు. అవతలి వ్యక్తి అనుమతి లేకుండా విదేశాల్లో పొందే విడాకులకు ఎలాంటి చట్టబద్ధత ఉండదని కోర్టు స్పష్టం చేసింది.

ఎన్ఆర్ఐ జంటల రెండో పెళ్లిళ్లకు చిక్కులు

ఈ తీర్పుతో విదేశాల్లో విడిపోయి, అక్కడి కోర్టుల ద్వారా విడాకులు తీసుకుని రెండో పెళ్లి చేసుకున్న ఎన్ఆర్ఐ దంపతులు చట్టపరమైన చిక్కుల్లో పడ్డారు. మొదటి విడాకులు చెల్లకపోతే వారి రెండో వివాహాలు కూడా చట్టవిరుద్ధమవుతాయి. దీనివల్ల భరణం, ఆస్తుల తగాదాలు, పిల్లల విషయాల్లో తీవ్ర సమస్యలు ఎదురవుతాయి. విదేశాల్లో పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నా, మన దేశపు ఫ్యామిలీ కోర్టులో ప్రత్యేక పిటిషన్ దాఖలు చేసి ఆమోదం పొందితేనే అది చెల్లుబాటు అవుతుంది.

మోసపోతున్న మహిళలకు రక్షణ కవచం

విదేశాల్లోని కొందరు భర్తలు తమ భార్యలను మోసగించి, అక్కడి కోర్టుల్లో ఏకపక్షంగా విడాకులు తీసుకుని వదిలేస్తున్న ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. ఈ తీర్పుతో అలాంటి భర్తలు కూడా భారతీయ చట్టాలకు తలవంచాల్సి వస్తుందని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. భార్యను మోసం చేసి విదేశాల్లో విడాకులు పొందడం ఇకపై సాధ్యం కాదని, ఇది మహిళల హక్కులకు బలమైన రక్షణగా నిలుస్తుందని వారు చెబుతున్నారు.



చట్టం దృష్టిలో చెల్లని కాగితమే

దేశం ఏదైనా, మన దేశంలో పెళ్లి చేసుకున్న వారు ఇక్కడి చట్టాల పరిధిలోనే తమ బంధాన్ని ముగించుకోవాలి. లేదంటే విదేశీ కోర్టు ఇచ్చే విడాకుల పత్రం మన చట్టం దృష్టిలో చెల్లని కాగితంతో సమానమే అవుతుంది. పెళ్లి అనేది రెండు కుటుంబాల మధ్య చట్టబద్ధమైన అనుబంధమని, దానిని విడదీయడం కూడా భారతీయ చట్టాల ప్రకారమే జరగాలని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది. భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా ఉండాలంటే విదేశాలకు వెళ్లే దంపతులు మన దేశ వివాహ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి.